
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శనివారం 16 మార్చి 2024

రంజాన్ వేళలు శనివారం(ఇఫ్తార్-6:34)। ఆదివారం (సహెర్-5:03)





మోదీ రాకకోసం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సిద్ధమౌతున్న సభా ప్రాంగణం

పోరుకు రెఢీ

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో పాత ప్రత్యర్థులే
- ఇద్దరు జాతీయ నాయకుల మధ్య బిగ్‌ఫైట్
- ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో మూడు పార్టీల విస్తృత ప్రచారం
- షెడ్యూల్ వెలువడిన తరువాత హీటెక్కనున్న పాలమూరు రాజకీయం



మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీహరి, జీఎంఆర్, పర్ణికారెడ్డి



మహబూబ్‌నగర్, మార్చి 15: మహబూబ్‌నగర్ పార్లమెంట్ విలక్షణ రాజకీయాలకు పెట్టింది పేరు. ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించిన ఎంపీలు దేశ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించారు. హేమాహేమీలు బరిలో దిగి, రాజకీయాలను శాసించారు. అందుకే ఈ పార్లమెంట్‌కు అంతటి ప్రాధాన్యం ఉంది. ఈసారి కూడా జాతీయ స్థాయిలో పరపతి ఉన్న నాయకులు తలపడుతుండటంతో మహబూబ్‌నగర్ లోక్‌సభలో బిగ్ ఫైట్ జరుగనుంది. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీలో అత్యున్నత స్థాయి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న చల్లా వంశీచంద్‌రెడ్డి పోటీలో ఉండగా, బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బరిలో ఉండనున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చారు. వీరి మధ్య గట్టి పోటీ నెలకొననుంది. 2019 ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి ఈ ముగ్గురు అభ్యర్థులే పోటీలో ఉండగా, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి డీకే అరుణపై 78 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

ఓ విడత ప్రచారం పూర్తి

ఈ ముగ్గురు నాయకులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే ఓ దశ ఎన్నికల ప్రచారం పూర్తి చేశారు. టికెట్ రాకముందే ప్రచారాన్ని ప్రారంభించి, ప్రజల్లోకి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా అభ్యర్థులు ప్రచారం నిర్వహించడం, ప్రజల్లోకి వెళ్లడం చూస్తే ఈ ఎన్నిక పార్టీలకు ఎంత కీలకమో అర్థమవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్ర పేరుతో ఎమ్మెల్యేలతో కలిసి పార్లమెంట్ పరిధిలో పాదయాత్ర నిర్వహించారు. అదేవిధంగా డీకే అరుణ బీజేపీ విజయ సంకల్ప యాత్ర పేరుతో పార్లమెంట్ పరిధిలో యాత్ర చేపట్టారు. బీఆరెస్ అన్ని నియోజకవర్గాలలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించింది. ఇలా మూడు పార్టీలు ఎవరికి వారు ప్రజల్లోకి వెళ్తూ విజయం కోసం తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ టికెట్ రాకముందే ప్రజల్లోకి వెళ్లి, ప్రచారం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు అభ్యర్థుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు.. సవాళ్లు ప్రతిసవాళ్లు జరిగాయి.

పార్టీలకు ప్రతిష్ఠాత్మకం

పాలమూరులో విజయం సాధించాలని అన్ని పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీలో టికెట్ కోసం పోటీ లేకపోవడంతో మొదటి జాబితాలోనే వంశీచంద్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. నియోజకవర్గ పరిధిలో ఏడు నియోజవర్గల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడంతో ఎమ్మెల్యేలంతా వంశీచంద్‌రెడ్డితో సమన్వయం చేసుకుని విజయమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేపట్టడం, సీఎం రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్ ఉండటం, ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహించడం, ఆరు గ్యారెంటీ పథకాలు.. తమకు కలిసివస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. బీజేపీ మాత్రం నియోజకవర్గ పరిధిలో చదువుకున్న ఓటర్లు అధికంగా ఉండటం, మోదీ చరిష్మా, రామమందిర నిర్మాణం, మహిళగా డీకే అరుణ పోటీ చేస్తుండటం వంటి అంశాలు తమకు కలిసివస్తాయనే ధీమాతో ఉంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని కాంగ్రెస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, సిటింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అన్ని పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంతో షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయనున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జితేందర్‌రెడ్డి

పాలమూరు రాజకీయాలు ఆసక్తిగా మారనున్నాయి. బీజేపీ టికెట్ ఆశించి టికెట్ దక్కకపోవడంతో నిరాశలో ఉన్న మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి కలిసిన విషయం తెలిసిందే. జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శుక్రవారం జితేందర్‌ను హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో కలవడం చర్చనీయాంశంగా మారింది. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిలు జితేందర్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి కలిసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ వెంటనే ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. పాలమూరు రాజకీయం రక్తి కట్టే అవకాశం లేకపోలేదు.

ఓటు బదిలీకి వంశీచంద్ దరఖాస్తు

కల్వకుర్తిలో ఉన్న తమ ఓటును మహబూబ్‌నగర్ పట్టణానికి బదలాయించాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి తన భార్యతో కలిసి మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్‌కు శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. కల్వకుర్తి అసెంబ్లీలోని తన సొంత గ్రామం శేరి అప్పారెడ్డిపల్లిలో ఉన్న వంశీచంద్, ఆయన భార్య ఆశ్లేషరెడ్డిల ఓట్లను బదలాయించాలని కోరారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు న్యాయయాత్రలో ప్రజలు చూపించిన ప్రేమ, అనురాగం, విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని కల్వకుర్తిలో ఉన్న తమ ఓటును ఇక్కడికి బదలాయించాలని దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పాలమూరు ప్రజలు తనను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లా ప్రజలకు సైనికుడిలా సేవ చేస్తానని, వారి రుణం తీర్చుకునేలా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.



తన ఓటును మహబూబ్‌నగర్‌కు బదిలీ చేయాలని తహసీల్దార్‌కు దరఖాస్తు ఇస్తున్న వంశీచంద్‌రెడ్డి

ప్రధాని మోదీపై.. ఆశలు

- నేడు నాగర్‌కర్నూల్‌కు రాక
- ఉమ్మడి జిల్లాకు మామిడి క్లస్టర్ మంజూరైనా మొదలు కాని పనులు
- పరిశ్రమల ఏర్పాటు, కేంద్ర విశ్వవిద్యాలయాలపై ఆసక్తి
- జడ్చర్ల వయా కొల్లాపూర్, నంద్యాల వరకు రైల్వేలైన్‌పై ఎదురు చూపులు

కొల్లాపూర్, మార్చి 15 : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి నాగర్‌కర్నూల్ జిల్లాకు శనివారం రానున్నారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో మోదీ ఇచ్చే హామీలు, అభివృద్ధి పనులకు నిధులపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మామిడి క్లస్టర్ మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు. మోదీ రాకతో ఆ ఆశ నెరవేరుతుందని మామిడి రైతులు ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17,284 మంది రైతులు 57,344 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఏటా 2,29,386 మెట్రిక్ టన్నుల మామిడి దేశ విదేశాలకు ఎగుమతి అవుతోంది.

మామిడి క్లస్టర్‌తో మేలు

మామిడి క్లస్టర్ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలు చేకూరనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మామిడి నర్సరీల ఏర్పాటుతో పాటు మామిడిని ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్టు వాహనాలు, మార్కెటింగ్ సౌకర్యం, రైతులకు వసతులు, కోల్డ్ స్టోరేజీలు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 2021లో క్లస్టర్ మంజూరైనా.. టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. ఇటీవలే హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ సీడ్స్ వారు టెండర్లు దక్కించుకోవడంతో త్వరలోనే పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టనున్నారు. ఈ క్లస్టర్ కోసం కేంద్రం రూ.172.3 కోట్లు మంజూరు చేసింది.

కొనసాగుతున్న జాతీయ రహదారి

కల్వకుర్తి వయా కొల్లాపూర్ మీదుగా కర్నూల వరకు 167కే జాతీయ రహదారికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. 70 శాతం పూర్తయ్యాయి. సోమశిల-కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మాణం కోసం భారత్‌మాల పరియోజన పథకం కింద కేంద్రం రూ.1.100 కోట్ల నిధులు కేటాయించింది. రోడ్డు పనులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మోదీ హామీలపై జిల్లా ప్రజల ఆసక్తి

మోదీ ఇచ్చే హామీలపై నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని నల్లమల అడవుల్లో లభించే ఖనిజ సంపదను, ముడి సరుకులను వినియోగించి ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుంది. ఉన్నత విద్య కోసం స్థానికంగానే కేంద్ర విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జడ్చర్ల వయా కొల్లాపూర్, నంద్యాల మీదుగా రైల్వేలైన్ మంజూరు, అలంపూర్ వయా గుందిమల్ల, కొల్లాపూర్ మీదుగా అచ్చంపేట, దేవరకొండ వరకు మరో జాతీయ రహదారి వంటి హామీల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సభకు ఏర్పాట్లు పూర్తి

- లక్ష మంది జన సమీకరణకు కసరత్తు



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు డీకే అరుణ, భరత్ ప్రసాద్

నాగర్‌కర్నూల్,(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకు రానున్నందున భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రలో పాల్గొననున్నారు. ఇందుకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పార్టీ మొదటి శ్రేణి నాయకులు డీకే అరుణ, తల్లోజు ఆచారి, ఎల్లేని సుధాకర్‌రావు, జక్కా రఘునందన్‌రెడ్డి శ్రమిస్తున్నారు. రెండు రోజులుగా నాగర్‌కర్నూల్‌లో శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ, సభను విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

లక్ష మంది జన సమీకరణే లక్ష్యం

మోదీ సభకు లక్ష మందిని జన సమీకరణ చేసేలా పార్టీ అగ్ర నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని వెలమ సంఘం కల్యాణ మండపం సమీపంలో గల దాదాపు 15 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండలు ముదిరిన నేపథ్యంలో సభకు వచ్చే ప్రజల కోసం భారీ టెంట్లు వేస్తున్నారు. దాదాపు వంద మంది కూర్చొనేలా సభా వేదికను నిర్మిస్తున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, గద్వాల, అలంపూర్, వనపర్తి నియోజకవర్గాల నుంచే కాకుండా మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి కూడా భారీగా జనాన్ని సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 10 వేల నుంచి 15 వేల మంది యువతీ యువకులను తరలించేలా వ్యూహ రచన చేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి కూడా సభకు రప్పించగలిగితే లోకసభ ఎన్నికల్లో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్న పార్టీ అగ్రనాయకత్వం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. సభ సజావుగా సాగేందుకు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపునకు చెందిన సిబ్బంది సభా వేదిక, ప్రాంగణాన్ని గురువారం ఉదయం నుంచే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యేక పోలీస్ బలగాలను మోహరించారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు కూడా రంగంలోకి దిగాయి.

ప్రధాని నరేంద్రమోదీ పర్యటన ఇలా..

హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేస్తారు. ఉదయం 10:30 గంటల వరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారు. ఆయన బహిరంగ సభ అనంతరం 11:45 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు. అయితే పార్టీ టికెట్లు దక్కనందున ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన జితేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి మోదీ సభకు హాజరవుతారా? లేదా? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

హత్యకు దారితీసిన గొడవ

- అల్లుడి తలపై కర్రతో దాడి చేసిన మామ
- తీవ్ర రక్తస్రావంతో మృతి
- విషయం బయటికి రాకుండా వాగులో పూడ్చివేత
- కురుమూర్తి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి..



సాయిలు(ఫైల్)



శవాన్ని పూడ్చిపెట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నచింతకుంట, మార్చి 15: భార్యాభర్తల మధ్య గల గొడవలు భర్త హత్యకు దారితీసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి గామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన గొల్ల బండారి సాయిలు(36)కు, చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన గాయిత్రికి 17 ఏళ్ల కిందట వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో జనవరిలో గాయిత్రి పుట్టింటికి వచ్చింది. ఈనెల 10న సాయిలు అత్తారింటికి వచ్చాడు. అదే రోజు అర్ధరాత్రి మామ వెంకటన్న, అల్లుడు సాయిలుకు మధ్య గొడవ జరిగింది. కోపంతో ఊగిపోయిన మామ కర్రతో అల్లుడి తలపై కొట్టాడు. తలకు బలమైన గాయం కావటంతో తీవ్ర రక్తస్రావమై సాయిలు కిందపడి మరణించాడు. విషయం బయటికి తెలియకుండా మృతదేహాన్ని గోనె సంచిలో వేశారు. తర్వాత మోపెడ్‌పై సమీపంలోని ఊకచెట్టు వాగులోకి తీసుకెళ్లారు. మృతుడి దుస్తులు బావిలో పడేసి, మృతదేహాన్ని ఇసుకలో పూడ్చిపెట్టారు. సాయిలు తండ్రి బండారి కృష్ణయ్య కొడుకు అత్తారింటికి ఫోన్ చేసి, తన కొడుకు మీ ఇంటికి వచ్చాడని, మళ్లీ మా ఇంటికి రాలేదని అడిగాడు. అందుకు అత్తారింటి వారు ఇక్కడకు వచ్చి వెళ్లాడని చెప్పారు. కొడుకు ఇంటికి రాకపోవడంతో అతని మామ, భార్యపై అనుమానం ఉందని కృష్ణయ్య చిన్నచింతకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సాయిలు మామ, భార్యను పట్టుకుని విచారించగా, నేరం ఒప్పుకున్నారు. అయితే ఈ హత్యకు భార్యా భర్తల మధ్య తలెత్తిన గొడవే కారణమని, క్షుద్ర పూజలు అంటూ వస్తున్న ఆరోపణలపై ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని డీఎస్పీ తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీతో పాటు జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడు, ఎస్ఐ శేఖర్ పరిశీలించారు. ఈ కేసును జడ్చర్ల రూరల్ సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల దాణా యంత్రంలో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల, మార్చి 15 : జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారిలోని స్నేహ కోళ్ల దాణా పరిశ్ర మంలో దాణా తయారీ యంత్రంలో పడి వెంకట్‌రెడ్డి(30) అనే వ్యక్తి మృతిచెందాడు. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కంభం మండలం కాకాల గ్రామా నికి చెందిన వెంకట్‌రెడ్డి స్నేహ కోళ్ల దాణా పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తు న్నాడు. శుక్రవారం తెల్లవారుఝామున దాణా తయారీకి యంత్రంలో వేసిన మొక్కజొన్నలులో కూరుకుపోయి మృతిచెందాడు. యంత్రంలో సాంకేతిక లోపం రావడంతో పరిశీలిస్తున్న సందర్భంగా ప్రమాదవశాత్తు అందులో పడడం, మొక్కజొన్నలలో కూరుకుపోవడంతో ఊపరి ఆడక మృతిచెందాడు. అనంతరం మొక్కజొన్నలలో కూరుకు పోయిన వెంకట్‌రెడ్డిని వెంటనే బయటికి తీసి, జిల్లా జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. తండ్రి వెంకటనారాయణ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గ్యాస్ పైపు లీకేజీపై ప్రజలకు అవగాహన

భూత్పూర్, మార్చి 15 : భూమిలో ఏర్పాటు చేసిన హెచ్‌పీసీ ఎల్ గ్యాస్ పైపులైన్ ఉన్న చోట పొరపాటున లీకైతే రైతులు, స్థానిక ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ నర్సింహా రావు తదితరులు సూచనలు చేశారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో హెచ్‌పీసీఎల్ కంపెనీవారు అప్‌సైట్ మాక్ డ్రిల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన కర్ణాటక రాష్ట్రంలోని హసన్ ప్రాంతం నుంచి మొదలై తెలంగాణ రాష్ట్రంలోని చర్లపల్లి వరకు 640కిలో మీటర్ మేరా ఈ పైపులైన్ ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇనిస్పెక్టర్ మనోహర్‌రెడ్డి, డివిజినల్ ఫైర్ అధికారి కిషోర్, ఎంపీడీవో శ్రీదేవి, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంపీటీసీ పుల్లయ్య, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, రైతులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీచెన్నకేశవస్వామి ప్రభోత్సవం

మన్ననూర్, మార్చి 15: అమ్రాబాద్ మండలం మన్ననూరు అంబేద్కర్ కాలనీలోని రామాలయం నుంచి రాయలగండికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ప్రభోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేసిన వాహనంపై లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహాల ఊరేగింపును గ్రామ పురవీధుల గుండా ఊరేగించి, పూజా సామగ్రిని మన్ననూరు రామాలయం తరపున ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు రఘున, గిరి, శేషయ్య, రామస్వామి, బాలస్వామి, బుచ్చయ్య, లక్ష్మణ్, రవి కుమార్, కాంగ్రెస్ నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, శివాజీ, బాలు, లోకనాథం, కర్ణయ్య సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న భీంపల్లి శ్రీకాంత్

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 15 : పాలమూరు జిల్లాకు చెందిన డాక్టర్ భీంపల్లి శ్రీకాం త్ జాతీయ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌లో శుక్ర వారం నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'తెలంగాణ అస్తిత్వం-ఉద్యమ కవితా సంకలనాలు' అనే అంశంపై భీంపల్లి శ్రీకాంత్ ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా వచ్చిన వివిధ తెలంగాణ ఉద్యమ కవితా సంకలనాల గురించి సవివరంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ప్రశం సాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రసింగ్, డాక్టర్ యాదగిరి, ఉస్మానియా విశ్వవిద్యాలమం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రస్తుత తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

నంబర్లను వెల్లడించలేదేం?



(మొదటి పేజీ తరువాయి)

గతంలో కోర్టుకు సమర్పించిన వివరాలను ఈసీ భద్రపరచాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు గురువారం తమ వెబ్‌సైట్‌లో బాండ్ల వివరాలను అప్‌లోడ్ చేసిన ఈసీ.. విరాళాల తాలూకు పత్రాలు కోర్టు వద్దే ఉన్నాయని, వాటిని తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఈ మేరకు ఇటీవలి తీర్పు అమలుకు సంబంధించి స్వల్ప సవరణలు కోరుతూ దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీ వై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ ఎస్బీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎస్బీఐ తరఫున ఎవరు వాదనలు వినిపిస్తున్నారు? ఇంతకుముందు మేం ఇచ్చిన తీర్పులో.. బాండ్లను కొన్న వారెవరు? బాండ్ విలువ ఎంత? ఏ రోజున కొన్నారు? వంటి అన్ని వివరాలను వెల్లడించాలని స్పష్టంగా పేర్కొన్నాం. కానీ, ఆ వివరాలేమీ తెలియజేయలేదు. బాండ్ల నెంబర్లను కూడా వెల్లడించలేదు' అని పేర్కొన్నారు. ఈ వివరాలన్నింటినీ తెలియజేయాల్సిందేనని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయపార్టీలకు విరాళాలకు సంబంధించిన వివరాల సీల్డ్ కవర్లను సుప్రీంకోర్టుకు గతంలో సమర్పించామని, వాటి తాలూకు మరొక కాపీ తమ వద్ద లేదని తెలిపారు. ఈ పత్రాలను భద్రపర్చాలని సుప్రీంకోర్టు మార్చి 11 నాటి తీర్పులో తమను ఆదేశించినందున, ఆ సీల్డ్ కవర్ పత్రాలను తమకు తిరిగి అప్పగించాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సదరు పత్రాల కాపీలు ఈసీ వద్ద ఉన్నాయని భావించి, వాటిని భద్రపరచమని ఆదేశించామని పేర్కొంది. ఆ పత్రాలను స్కాన్ చేసి డిజిటైజ్ చేయాలని, అనంతరం ఒరిజినల్ పత్రాలతోపాటు ఒక డిజిటల్ ఫైల్ కాపీని కూడా ఈసీకి అందజేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ పని శనివారం సాయంత్రం ఐదు గంటల లోపు జరగాలని, అదే రోజుగానీ మరుసటి రోజుగానీ ఆ పత్రాలను కూడా ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాను కేంద్రం తరఫున మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నానని, ఎస్బీఐ తరఫున కాదని ధర్మాసనానికి విన్నవించగా.. విచారణ జరుగుతున్న సమయంలో వారు (ఎస్బీఐ తరఫు న్యాయవాదులు) కూడా ఇక్కడ ఉండాలి అని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఎస్బీఐకి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

నేపథ్యం ఇదీ..

రాజకీయపార్టీలు తమకు అందే విరాళాల గురించి పూర్తి వివరాలను ఈసీకి సీల్డ్ కవర్‌లో అందజేయాలని సుప్రీంకోర్టు 2019 ఏప్రిల్ 12న మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. గత ఏడాది నవంబరు 2వ తేదీన కూడా ఇదే కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు.. ఈసీ సీల్డ్ కవర్లు, సీల్డ్ బాక్సులను సుప్రీంకోర్టుకు గతంలో అందజేసింది.

ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ 'క్విడ్ ప్రో కో'

స్వతంత్ర భారత్‌లో అతిపెద్ద కుంభకోణం

» బీజేపీ అవినీతి వ్యూహాలు బహిర్గతం: కాంగ్రెస్

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 15: ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బీజేపీ అనుసరిస్తున్న అవినీతి వ్యూహాలను బహిర్గతం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. స్వతంత్ర భారతదేశంలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అప్పటివరకు కాషాయ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని పేర్కొంది. "అవినీతికి పాల్పడం, పాల్పడనివ్వం.. అని ప్రధాని మోదీ చెబుతారు. కానీ, ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ నిధులను ఎలా సేకరిస్తోందనే విషయం సుప్రీంకోర్టు బయటపెట్టింది. బడా వ్యాపారవేత్తలు అంత మొత్తంలో ఆ పార్టీకి నిధులు ఎలా సమకూర్చారు? విరాళాలు ఇచ్చిన వారిలో ఎక్కువగా ఈడీ, ఐటీ దాడులను ఎదుర్కొన్నవారే" అని శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బీజేపీకి వచ్చిన విరాళాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని, అప్పటివరకు ఆ పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు. 'స్వతంత్ర భారతంలో ఇది అతిపెద్ద కుంభకోణం. సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం మాకు ఉంది. ప్రజా కోర్టుకు వెళ్తాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. చాలా కంపెనీలు బీజేపీకి ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాయని ఆరోపించారు. టార్గెట్ చేసుకున్న కంపెనీలపై ముందు ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరిపిస్తారని.. ఆ తర్వాత వసూళ్లు (ఎన్నికల బాండ్లు) చేపడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల బాండ్లు చట్టవిరుద్ధమైన పథకమని, ఇందులో 'క్విడ్ ప్రోకో' ఉందని కపిల్ సిబల్ ఆరోపించారు.

ఎస్బీఐ 'జాబితా' వెనుక కేంద్ర పెద్దలు



న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఒక్కో రాజకీయ పార్టీకి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన వివరాలను సవివరంగా వెల్లడించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఎస్బీఐ వెలువరించిన జాబితా వెనుక కేంద్ర పెద్దలున్నారని ఆరోపించారు. దొంగలను కాపాడేందుకే ఎస్బీఐ వివరాలు సరిగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కార్పొరేట్ కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా క్విడ్ ప్రో కోకు పాల్పడ్డాయని ఆరోపించారు.

కొనుగోలు చేసిన బాండ్లు వర్సెస్ నికర లాభాలు

కంపెనీ పేరు	కొనుగోలు చేసిన బాండ్లు (రూ.కోట్లలో)	2019-20 నుంచి 2022-23 వరకు నికర లాభం (రూ.కోట్లలో)
ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్	1368	215
మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్	966	7509
క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్	410	109
వేదాంత లిమిటెడ్	400	48372
హల్దియా ఎనర్జీ లిమిటెడ్	377	1274
ఎస్సెల్ మైనింగ్ అండ్ ఐఎన్‌డీఎస్	224	3700
ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్	192	58
మదన్‌లాల్ లిమిటెడ్	185	10
భారతీ ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్	183	253
ఉత్కల్ అల్యూమినియా ఇంటర్నేషనల్	145	3713
జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్	123	18482
టోరెంట్ పవర్ లిమిటెడ్	106	5076
ఐఎఫ్‌బీ అగ్రో ఐఎన్‌డీఎస్ లిమిటెడ్	92	175

భారీగా విరాళాలిచ్చింది వీళ్లే

గనులు, విద్యుత్, ఇన్‌ఫ్రా సంస్థలదే అగ్రస్థానం.. విరివిగా నిధులిచ్చిన హైదరాబాద్ మౌలిక, ఫార్మారంగం

న్యూఢిల్లీ, మార్చి 15: రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చిన సంస్థల్లో మౌలిక సదుపాయాలు, గనులు, విద్యుత్ కర్మాగారాల సంస్థలే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అయిదేళ్ల వ్యవధిలో రూ.16,500 కోట్లకు పైగా విరాళాలు కంపెనీలు అందజేయగా, హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా, ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీలు అందులో తమవంతు పాత్ర పోషించాయి. అయితే, అగ్రస్థానంలో ఉన్న పది కంపెనీల్లో హైదరాబాద్ కంపెనీ మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే ఉంది.

1) ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్: కోయంబత్తూరు రిజిస్టర్డ్ సంస్థ. ఏకంగా 1,368 కోట్ల రూపాయల బాండ్లు కొన్నారు. ఈడీ కేసులున్నాయి. మార్టిన్ లాటరీ ఏజెన్సీస్ అనే పేరుతో కొన్నాళ్లు నడిచింది. యజమాని మార్టిన్ చాలాకాలంలో దేశంలో కెల్లా అత్యధిక పన్ను చెల్లింపుదారుగా ఉన్నారు. నిర్మాణం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీ వార్షికాదాయం 16,500 కోట్లు.

2) మేఘా ఇంజనీరింగ్: హైదరాబాద్ కంపెనీ. 966 కోట్ల విరాళాలు ఇచ్చింది. దాని అనుబంధ సంస్థ టాప్ -10లో ఏడో స్థానంలో ఉన్న వెస్టర్న్ యూపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరో 220 కోట్లు ఇచ్చింది. టన్నెళ్లు, రైల్వే మౌలిక సదుపాయాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణంలో ప్రసిద్ధి. హిమాలయాల్లో జోజిల్లా రోడ్ టన్నెల్ నిర్మాణం చేస్తోంది.

3) క్విక్ సప్లయి చైన్: ఇది ముంబైకి చెందిన లాజిస్టిక్స్ కంపెనీ. ఏకంగా 410 కోట్లు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చింది. 2000 సంవత్సరంలో 130 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేశారు. గోదాములతోపాటు మానవ వనరుల నిర్వహణ కూడా చేస్తోంది. 2021-22లో కేవలం రూ.21 కోట్ల ఆదాయం ఉన్న ఈ సంస్థ ఆ సంవత్సరం ఏకంగా 360 కోట్ల విరాళం ఇచ్చింది. దీని కేంద్ర కార్యాలయం నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జి పార్క్‌లో ఉంది. దాని డైరెక్టర్లు కూడా రిలయన్స్ ఇతర కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. పైగా, దేశంలోని అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన రిలయన్స్ ఎలాంటి విరాళాలు ఇవ్వలేదు. 410 కోట్లు రిలయన్స్ విరాళాలేనని వార్తలు వచ్చిన నేపథ్యంలో క్విక్ సప్లయి చైన్ తమ అనుబంధ సంస్థ కాదని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది.



4) వేదాంత: అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత 401 కోట్లు ఇచ్చింది. పలు రకాల గనుల వ్యాపారం ఉంది. బ్రిటన్ సంస్థకు అనుబంధ సంస్థ. గ్రూప్‌ను ఆరు భాగాలుగా విభజించే క్రమంలో ఉంది.

5) హల్దియా ఎనర్జీ: బెంగాల్లోని హల్దియాలో భారీ థర్మల్ విద్యుత్ కర్మాగారాలు నిర్వహిస్తున్న హల్దియా గ్రూపు 377 కోట్ల విరాళాలు ఇచ్చింది. గోయంకా కుటుంబానికి చెందిన ఈ సంస్థకు మోహన్ బగాన్ ఫుట్‌బాల్ జట్టు, ఐపీఎల్ లఖ్‌నవూ జట్టు ఉన్నాయి. ఇ

6) ఎస్సెల్ మైనింగ్: దేశంలో అతిపెద్ద ప్రైవేటు బొగ్గు గనుల సంస్థ. 225 కోట్లు విరాళాలుగా ఇచ్చింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది.

7) వెస్టర్న్ యూపీ పవర్: దేశంలో అతిపెద్ద విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. 220 కోట్ల విరాళం ఇచ్చింది. ఇది మేఘా అనుబంధ సంస్థ.

8) భారతి ఎయిర్‌టెల్: జియో తర్వాత దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ. 198 కోట్ల విరాళాలు ఇచ్చింది.

9) కెవెంటర్ ఫుడ్ పార్క్: బెంగాల్లో ఆహారం, పాల ఉత్పత్తుల ఎగుమతుల వ్యాపారం ఉంది. 195 కోట్ల విరాళం ఇచ్చింది.

10) ఎంకేజీ ఎంటర్‌ప్రైజెస్: బెంగాల్ సంస్థ. స్టీల్ వ్యాపారంలో ఉంది. 192 కోట్లు ఇచ్చింది.

162 కోట్లు ఇచ్చింది ఎవరు?

పన్నెండవ స్థానంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉంది. ఏకంగా రూ.162 కోట్ల విరాళం ఇచ్చింది. అయితే, ఘాజియాబాద్‌లోని యశోద, హైదరాబాద్‌లోని యశోద రెండూ ఆ విరాళాలు తమవి కాదని స్పష్టం చేశాయి. యశోద హాస్పిటల్స్ పేరుతో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిందెవరనేది తేలాల్సి ఉంది. మరోపక్క ఈడీ దాడులకు గురయిన కంపెనీలే బీజేపీకి భారీగా విరాళాలు ఇచ్చాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. తప్పుని నిరూపించ దలచుకుంటే విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేసింది.

తెలుగు కంపెనీలు

తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్న కొన్ని కంపెనీలు కూడా భారీగానే విరాళాలు ఇచ్చాయి. రెడ్డి ల్యాబ్స్ రూ.80 కోట్లు, నాట్కో ఫార్మా రూ.69 కోట్లు, ఎన్‌సీసీ రూ.60 కోట్లు, దివి ల్యాబ్స్ రూ.55 కోట్లు, నవయుగ రూ.55 కోట్లు, రామ్‌కో సిమెంట్స్ రూ.54 కోట్లు, అరబిందో ఫార్మా రూ.52 కోట్లు, రిత్విక్ ప్రాజెక్టు రూ.45 కోట్లు, అపర్ణ ఎస్టేట్స్ రూ.30 కోట్లు, సన్ ఫార్మా 31 కోట్లు, హెటిరో డ్రగ్స్ రూ.30 కోట్లు, హెటిరో ల్యాబ్స్ రూ.25 కోట్లు, హెటిరో బయో ఫార్మా 5 కోట్లు, హానర్ ల్యాబ్స్ రూ.25 కోట్లు, నూజివీడు సీడ్స్, ప్రభాకర్‌రావు కలిపి రూ.27 కోట్లు, మైహోం రూ.15 కోట్లు, ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్ రూ.10 కోట్లు, సంధ్య కన్‌స్ట్రక్షన్స్ 13 కోట్లు, నర్రా కన్‌స్ట్రక్షన్స్ రూ.10 కోట్లు, మైహోం ఇన్‌ఫ్రా రూ.10 కోట్లు, భారత్ బయోటెక్ రూ.10 కోట్లు, వంశీరాం బిల్డర్స్ 7 కోట్లు, శ్రీచైతన్య 5 కోట్లు, రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చాయి. ఫార్మ హెల్త్‌కేర్ రంగాలే ఏకంగా రూ.900 కోట్ల విరాళాలు ఇచ్చాయి.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.3	17.7
నల్లగొండ	37.0	24.4
నిజామాబాద్	37.0	22.4
వరంగల్	36.0	23.5
ఖమ్మం	36.0	24.0
సంగారెడ్డి	36.0	26.0
హైదరాబాద్	35.8	24.1

విరాళాలకు, ఈడీ దాడులకు సంబంధమే లేదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 15: అధికార పార్టీకి అందే ఎన్నికల విరాళాలకు, కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే దాడులకూ ఎలాంటి సంబంధం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు కేవలం ఊహాగానాలేనని చెప్పారు. "ఈడీ వెళ్లి కంపెనీలపై దాడులు చేస్తే, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయనుకోవడం పూర్తిగా ఊహాగానమే. ఎన్నికల బాండ్లు కొన్న తర్వాత కూడా ఈడీ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి కదా! మరి దాన్నేమంటారు?" అని ఆమె ప్రశ్నించారు. ఇక ఎలక్టోరల్ బాండ్లన్నీ అధికార బీజేపీకే వచ్చాయని చాలా మంది ప్రచారం చేస్తున్నారని.. అది కూడా తప్పని చెప్పారు. కంపెనీలు ప్రాంతీయ పార్టీలకు కూడా విరాళాలు ఇస్తాయని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. గతంలో కంటే ఇది మెరుగైన విధానమేనని పేర్కొన్నారు. గత వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయి కదా? అని నిర్మల ప్రశ్నించారు. గతంలో కంటే మెరుగైనదిగా భావించే మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు.

మార్టిన్ మోసగాడు.. జాగ్రత్త

» 2019 సెప్టెంబరులో కేంద్రం హెచ్చరిక

» అత్యధికంగా రూ.1,368కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ కొన్న లాటరీ కింగ్ మార్టిన్

» కూలీ నుంచి రూ.వేల కోట్లకు అధిపతి



చెన్నై, మార్చి 15: "అతడు మోసగాడు.. జాగ్రత్త..!" ఇది ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి శాంటియాగో మార్టిన్ కార్యకలాపాల గురించి 2019 సెప్టెంబరు 23న కేంద్ర హోం శాఖ పలు రాష్ట్రాలకు చేసిన హెచ్చరిక. ఆ వెంటనే కేవలం 10 రోజుల్లోనే మార్టిన్ వరుసగా ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలు మొదలుపెట్టాడు. ఆ నెలలో ఏకంగా రూ.190 కోట్ల బాండ్లను కొనుగోలు చేశాడు. అప్పటినుంచి ఈ జనవరి దాక రూ.1,368 కోట్ల బాండ్లతో అత్యధికంగా బాండ్స్ కొన్న వ్యక్తిగా నిలిచాడు. మార్టిన్, అతడి సంస్థలపై పన్ను ఎగవేతలు, మనీ ల్యాండరింగ్, మోసం ఆరోపణలు రావడంతో 2011 నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను (ఐటీ) శాఖలు దృష్టిసారించాయి. కోయంబత్తూర్‌లో భూ ఆక్రమణలు, మోసానికి పాల్పడినందుకు కేసులు నమోదయ్యాయి. కేరళలో లాటరీల్లో అక్రమాలను అక్కడి ప్రభుత్వం కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో కేరళలో అతడి సిక్కిం స్టేట్ లాటరీ కార్యకలాపాలపై నిషేధం విధించింది. మార్టిన్‌పై సీబీఐ కేసులు కూడా ఉన్నాయి. బహుమతి మొత్తాన్ని పెంచి చూపి రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమంగా ఆర్జించారనే కేసు వీటిలో ఒకటి. ఈడీ 2019 ప్రారంభంలోనే ఫ్యూచర్ గేమింగ్ సంస్థపై విచారణ మొదలుపెట్టింది. ఆ ఏడాది జూలైలో రూ.250 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. 2022 ఏప్రిల్ 2న ఇదే కేసులో మరో రూ.409 కోట్ల చరాస్తులనూ ఫ్రీజ్ చేసింది. ఆ తర్వాత ఐదు రోజుల్లోనే మార్టిన్ సంస్థ ఏకంగా రూ.100 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం గమనార్హం.

కాగితాలపైనే కార్యాలయాలు

రూ.వేల కోట్ల లావాదేవీలు సాగిస్తూ అంతేస్థాయి విరాళాలు ఇచ్చిన మార్టిన్ వ్యాపార కార్యాలయాన్నీ కాగితాలపైనే అని ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో ఉన్న ప్రకారం పంజాబ్‌లోని లూధియానాలో ఉన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ కార్యాలయ చిరునామాకు వెళ్లగా అక్కడసలు కార్యాలయమే లేదని తేలింది.

ఆదాయం రూ.215 కోట్లే..

2019-23 మధ్య ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఆదాయం రూ.215 కోట్లే. కానీ, రూ.1,368 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లో ఖాతాలు ఫ్రీజ్ చేసినా 2023లో రూ.100 కోట్లను విరాళం ఇచ్చింది. నిరుడు జూలై 6వ తేదీన రూ.100 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లోనే రూ.400 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేయగా.. ఖాతాలు ఎలా నిర్వహించింది? విరాళాలు ఎలా ఇచ్చిందనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఇంతకూ ఎవరీ మార్టిన్?

ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి, లాటరీ కింగ్‌గా పేరుగాంచిన మార్టిన్ తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందినవాడు. తొలుత మయన్మార్ రాజధాని యాంగూన్‌లో కూలీగా పనిచేశాడు. 13 ఏళ్ల వయసుకే 'లాటరీ' వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. 1988లో భారత్‌కు తిరిగొచ్చి తమిళనాడులో కార్యకలాపాలు మొదలుపెట్టాడు. కర్ణాటక, కేరళ, బెంగాల్, పంజాబ్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాలకు మార్చి నేపాల్, భూటాన్ దేశాలకూ విస్తరించాడు.

కేరళలో కమల వికాసం ఖాయం

పతనంతిట్ట(కేరళ): ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాల అవినీతి, అసమర్థ పాలనలో కేరళ ప్రజలు ఎన్నో కష్టాలు భరించారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన దక్షిణ కేరళలోని పతనంతిట్ట జిల్లాలో గణనీయ ప్రాబల్యం ఉన్న క్రైస్తవ కమ్యూనిటీతో భేటీ అయ్యారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'గత ఎన్నికల్లో కేరళ ప్రజలు మమ్మల్ని రెండంకెల ఓట్ల శాతం కలిగిన పార్టీని చేశారు. ఇక్కడ మేం రెండంకెల సీట్ల లక్ష్యాన్ని సాధించే రోజు ఎంతో దూరంలో లేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కమలం వికసించడం ఖాయం" అని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, మాజీ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ కె. ఆంటోనీని యువతకు ప్రతినిధిగా మోదీ అభివర్ణించారు. గతేడాది కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన అనిల్ ఆంటోనీ రాబోయే ఎన్నికల్లో పతనంతిట్ట లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళనాడులోని కోయంబత్తూరులో ప్రధాని మోదీ పాల్గొనే రోడ్‌షోకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆర్‌ఎస్ పురంలో ప్రధాని మోదీ ఈ నెల 18న బీజేపీ నిర్వహించే రోడ్ షోలో పాల్గొనాల్సి ఉంది. అయితే.. ఇక్కడ 1998లో బాంబు పేలుళ్లు జరిగాయి. ఇక్కడ భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కోయంబత్తూరు జిల్లా పోలీసులు రోడ్‌షోకు అనుమతించలేదు. అయితే, 4 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించుకునేందుకు మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చింది.



కన్యాకుమారిలో ఓ సభలో మోదీ, నటి రాధిక, శరత్‌కుమార్

కంటి నిండా కునుకుండట్లే..!!

» దేశంలో పెరుగుతున్న నిద్రలేమి సమస్య

» తగినంత నిద్రపోయేది 27% మందే

» రెస్‌మెడ్ స్లీప్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన విధానాలు, పెరుగుతున్న సమస్యలు మనిషికి కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నాయి. తగినంత నిద్ర లేకపోవడం అనేది శరీరంపై తీవ్ర ప్రభావమే చూపుతుంది. అనేక శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతుంది. ఈ నిద్రలేమితో బాధపడుతున్న వారి సంఖ్య దేశంలో నానాటికి అధికమవుతోంది. మన దేశంలో కేవలం 27 శాతం మంది మాత్రమే ప్రతి రోజు రాత్రి వేళ సరిపడా (కనీసం 6 నుంచి 8 గంటలు) నిద్రపోతున్నారు. ప్రపంచ నిద్రా దినోత్సవం సందర్భంగా రెస్‌మెడ్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన రెస్‌మెడ్ స్లీప్ సర్వే-2024లో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా 36వేల మందిపై ఈ సర్వే చేశారు. ఇదే సంస్థ 2023లో నిర్వహించిన సర్వేలో సుమారు 80 శాతం మంది తగినంత నిద్రపోతున్నట్లు తేలింది. తాజా గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడం దేశంలో నిద్రలేమి సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. కాగా, పని ఒత్తిడి వల్లే తమకు నిద్ర ఉండడం లేదని సర్వేలో పాల్గొన్నవారిలో 42 శాతం మంది వెల్లడించడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాల్లో 38 శాతం మంది పని ఒత్తిడి వల్ల రాత్రిళ్లు తగినంత సేపు నిద్రపోవడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇది 42 శాతంగా ఉంది. నిద్రలేమి వల్ల పని ప్రదేశంలో పూర్తి సామర్థ్యం మేరకు పని చేయలేకపోతున్నామని సర్వేలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది చెప్పారు. కాగా, రాత్రి మంచం ఎక్కిన తర్వాత సెల్‌ఫోన్ చూడడమనేది చాలా మందికి అలవాటుగా మారిందని, నిద్రలేమికి ఇది ప్రధాన కారణమని భావిస్తున్నారు.

నేడే ఎన్నికల భేరి



(మొదటి పేజీ తరువాయి)


తేదీలను వెల్లడిస్తుంది. ఆంధ్ర, తెలంగాణల్లో ఏప్రిల్ నెలాఖరులో పోలింగ్ జరగొచ్చని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 97 కోట్ల మంది అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం 12 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4-5 దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశముంది. ఆంధ్ర, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయంటున్నారు. నక్సల్స్ ప్రభావం కారణంగా ఒడిసాలో గత ఎన్నికల మాదిరిగా నాలుగు దశల్లో జరిగే వీలుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303, కాంగ్రెస్ 52, డీఎంకే 24, టీఎంసీ 22, వైసీపీ 22, శివసేన 18, జేడీయూ 16, బీజేడీ 12, బీఎస్పీ 10, టీఆర్‌ఎస్ 9 సీట్లు గెలిచాయి. ఈ దఫా లోక్‌సభ ఎన్నికలు విపక్ష ఇండియా కూటమికి జీవన్మరణ సమస్యగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వివిధ సర్వేలు ఎన్డీయే హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, బీజేపీ సొంతంగా 350 స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేయడంతో అధికార కూటమి సమరోత్సాహంతో ఉంది. కాగా, బీజేపీ ఇప్పటికే 267 మంది అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ కూడా 82 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. టీఎంసీ బెంగాల్, అసోంలలో పోటీచేసే 47 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్, ఎస్పీ కూడా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి.

కమిషనర్ల నియామకాలపై స్టేకు నో

సీజేఐని సెలెక్ట్ ప్యానెల్ నుంచి తప్పించి అందులో ఒక కేంద్ర మంత్రిని నియమించేలా 2023లో చేసిన చట్టం ఆధారంగా జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలను కొత్త ఎన్నికల కమిషనర్లుగా నియమించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సాధారణంగా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఏ చట్టాన్నీ కోర్టు నిలిపివేయదని వ్యాఖ్యానించింది. కొత్త కమిషనర్ల నియామక చట్టాన్ని, జ్ఞానేశ్, సంధూల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కొత్త కమిషనర్ల నియామకం కోసం సెలెక్ట్ కమిటీ సమావేశాన్ని ముందుకు జరిపారని పిటిషనర్లలో ఒకరైన జయా ఠాకూర్ తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ ప్రస్తావించారు. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

భారత నేవీ మాజీ చీఫ్ రాందాస్ ఇకలేరు

» నేడు తిరుమలగిరిలో అంత్యక్రియలు.. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్(రిటైర్డ్) లక్ష్మీనారాయణ్ రాందాస్ (90)ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. 1933 సెప్టెంబరు5న ముంబైలో జన్మించిన రాందాస్.. 1953 నుంచి 1993 వరకు భారత నౌకా దళంలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించారు. 1971లో భారత్-పాక్ యుద్ధంలోనూ నౌకాదళ అధికారిగా రాందాస్ ముఖ్య పాత్ర పోషించారు. అందుకుగాను ఆయన్ను భారత ప్రభుత్వం వీర్ చక్ర అవార్డుతో సత్కరించింది. 1990 జనవరి 30న 13వ భారత నౌకాదళ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన రాందాస్.. పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నౌకాదళంలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించి చరిత్రలో నిలిచారు. రాందాస్ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గ వాటికలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

యడియూరప్పపై పోక్సో కేసు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పపై బెంగళూరు నగరం సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ అయిన తన కూతురుపై ఫిబ్రవరి 2న యడియూరప్ప లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని బాలిక తల్లి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయం కోసం కూతురుతో కలిసి వెళ్లానని, యడియూరప్ప తమతో 9 నిమిషాలపాటు మాట్లాడారని, ఆ తర్వాత బాలికను గదిలోకి తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. గది నుంచి బయటకు వచ్చిన యడియూరప్ప క్షమాపణలు చెప్పారని, ఎవరికీ చెప్పవద్దని భయపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు పోక్సో చట్టం 8, ఐపీసీ సెక్షన్ 354(ఎ) కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై యడియూరప్ప శుక్రవారం బెంగళూరులో స్పందించారు. తమకు అన్యాయం జరిగిందని తల్లీకూతుళ్లు నెలన్నర కిందట తన ఇంటికి వచ్చి కన్నీరు పెట్టుకున్నారని, కొంత ఆర్థిక సాయం చేసి, నగర పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేసి వారికి న్యాయం చేయాలని సూచించానని అన్నారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని, అంతకు మించి మాట్లాడేది ఏమీ లేదని అన్నారు. కాగా ఈ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీజీపీ అలోక్‌మోహన్ తెలిపారు.

సీఏఏపై 19న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టంపై (సీఏఏ) దాఖలైన పిటిషన్లను ఈ నెల 19న విచారించనున్నట్టు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. సీఏఏ అమలుపై స్టే విధించాలంటూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఈ నెల 12న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా.. "2019 నుంచి ఇప్పటి వరకు సుమారు 195 పిటిషన్లు వచ్చాయి. మంగళవారం దీనిపై వాదనలు వింటాం. అన్నింటినీ కలిపి విచారిస్తాం" అని ధర్మాసనం తెలిపింది. సీఏఏను వ్యతిరేకిస్తున్న ఇండియా కూటమి నేతల వైఖరికి నిరసనగా ఢిల్లీలో మొదలైన ఆందోళనలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి.

'ఫ్రీ సింబల్'పై ఈసీ విధానాన్ని పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, మార్చి 15: గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చే 'ఫ్రీ సింబల్'(ఎన్నికల గుర్తు) విధానాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. 'ఎవరు ముందు వస్తే వారికి ముందు' అనే విధానంలో గుర్తింపు పొందని పార్టీలకు ఈసీ ఎన్నికల గుర్తులు కేటాయిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ తమిళనాడుకు చెందిన గుర్తింపు పొందని పార్టీ 'నామ్ తమిళర్ కట్చి' సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారణకు స్వీకరించిన కోర్టు.. దీనిపై స్పందించాలని కోరుతూ శుక్రవారం ఈసీకి నోటీసులు జారీ చేసింది.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్ పర్సునాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బల్మూరు, మార్చి 15 : మండల కేంద్రంలోని గోదల్ వైపున వెళ్లే రోడ్డు మార్గాన ఐదెకరాల ప్రభుత్వ భూమిని 26 సర్వే నెంబర్‌లో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టాల పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పర్సునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శంకర్ నాయక్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇల్లు నిర్మాణం చేసుకుంటే అడ్డుకుని ఇచ్చిన ప్లాట్లను రద్దు చేయడం దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తపర్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి మూడు నెలలు కావస్తుంది.. ఇప్పటికైనా మండల కేంద్రంలో గోద ల్ రోడ్డు వైపున వెళ్లే మార్గాన ఐదెకరాల భూమిని ఇళ్ల స్థలాలు లేని నిరుపేద లకు పంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు పంచక పోతే సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను గుర్తించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. సీపీఎం మండల నాయకులు ఎండి.లాల్‌మహమ్మద్, సీని యర్ నాయకుడు బాలీశ్వరయ్య, గ్రామ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు బాబర్, మాసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మన్ననూరులోని వివేకానంద కూడలి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మన్ననూర్, మార్చి 15: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆర్యవైశ్య కార్పొరేషన్‌తో పాటుగా 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు కేబినేట్‌లో ఆమోదం తెలుపడం ఇందుకు నిదర్శనమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ అమ్రాబాద్ మండలం మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై వివేకానంద విగ్రహం ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. చాలా ఏళ్లుగా గత ప్రభుత్వాలు ఆర్యవైశ్యుల అభివృద్ధిని విస్మరించారని, ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు బాటలు వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆర్యవైశ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణలకు స్థానిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎక్జిక్యూటివ్ సభ్యుడు సంబు వెంకటరమణ, కోఆప్షన్ సభ్యుడు రహీం, ఆర్యవైశ్య సంఘం నాయకులు బిల్లకంటి రమేష్, కుమార, సంబు శ్రీనివాసులు, భాస్కర్, బాలింగయ్య, సంబు శోభ, భాగ్యమ్మ, సరిత, కాంగ్రెస్ నాయకులు తుల్యా నాయక్, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, శివాజి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెల్దండ, మార్చి 15 : గుండాల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం యెన్నం ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆస్పత్రి చైర్మన్ యెన్నం హరికాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్ చైర్మన్ అంజన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైద్యులు శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు నరహరి, ఈవో ప్రసాద్, సిబ్బంది సలీం, బొక్కల శ్రీను, మెరుగురాజు, గణేస్, ఆంజనేయులు ఉన్నారు.

● తిమ్మాజిపేట : మండల కేంద్రంలోని మరికల్‌లో శుక్రవారం ఏగూరు ప్రైమ్ ఆసుపత్రి జడ్చర్ల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. గైనకాలజిస్టు డాక్టర్ ఏగూరు రచిత 90మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో బాలికలు, గర్భిణులు, ఇతరత్రా సమస్యలు గల మహిళలకు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిం చి ఐరన్ కాల్షియం, మల్టీ విటమిన్ మందులే కాకుండా ప్రోటీన్ పౌడర్ ఉచితం గా అందజేసి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధి కారి పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్ వైద్య శిబిరాన్ని సందర్శించి గైనకాలజిస్టు డాక్టర్‌తో శిబిరానికి సంబంధించిన పలు విషయాలపై మాట్లాడారు.

ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

కందనూలు, మార్చి 15 : ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ ఎం.బాలనరసింహ డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా సమితి సమావేశం సీపీఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఉండే దళితులు, ఆదివాసులు, గిరిజనులకు ప్రభుత్వమే సొంత స్థలాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో మోసం చేసినట్లుగా కాకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను పూర్తిగా నిర్మాణం చేసి ఇవ్వాలని, అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తెలంగాణ ప్రాంతంలో ఉండే కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస పోకుండా సొంత గ్రామంలోని పనులను కల్పించాలని, రోజు వారి వేతనం 600రూపాయలు దినసరి కూలీ, పని ప్రదేశాల్లో మంచినీటి వసతులు, టెంట్లు, పారలు, గడ్డపారలు, తట్టలు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోల ఏసయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు కరీం, రామయ్య, గోవిందు, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ దీక్షలు

కందనూలు, మార్చి 15 : నాగర్‌కర్నూల్ జి ల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రావు భవన్‌లో రాష్ట్ర దళిత ఉద్యో గ సంఘం నా యకుడు వంకేశ్వ రం నిరంజన్ ఆధ్వర్యంలో శుక్రవారం జైభీమ్ దీక్షలు చేపట్టారు. జైభీమ్ దీక్షా సమితి వ్యవస్థాపకుడు, రాష్ట్ర దళిత నాయకుడు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడు తూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 14వరకు దళిత బహుజన నాయకుడు కాన్షీరాం, బాబు జగ్జీవన్‌రావు, మహాత్మాజ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ల జయంతుల సందర్భంగా దళిత బహుజనులు పవిత్ర మాసంగా భావించాలన్నారు. నాయకులు దేవరపాగ బంగారయ్య, కొత్త పరుశరాములు, వి.శివ, కొత్త గంగాధర్, వంకేశ్వరం శ్రీనివాసులు, వై.నిరంజన్, మిద్దె భాస్కర్, మిద్దె వెంకట స్వామి, కావలి కృష్ణయ్య, పల్లె బంగారయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

ఉప్పునుంతల, మార్చి 15: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని గువ్వలోనిపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదశాత్తుగా కృష్ణారెడ్డి, పుల్లయ్యకు చెందిన రెండు గడ్డి వాములు దగ్ధం అయినట్లు బాధితుడు వాపోయారు. సుమారు 4 ట్రాక్టర్లు గడి వాములు, రూ.35 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. గ్రామ సమీపంలో ఉండటంతో పశువుల కాపరులు బీడీ తాగి అక్కడ పడేయడంతో ప్రమాదం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి

- జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్



జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్‌ను పూల మాల, శాలువాతో సన్మానిస్తున్న జైగౌడ ఉద్యమం నాయకులు

పెద్దకొత్తపల్లి, మార్చి 15 : రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం పెద్దకొత్తపల్లిలో జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎంపికైన గుండ్రాతి నారాయణగౌడ్‌ను జైగౌడ ఉద్యమం మండల కమిటీ ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం గీత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామంలో ఈత వనాల కోసం ప్రభుత్వం ఐదెకరాల భూమిని కేటాయించాలని, ప్రమాదవశాత్తున మృతి చెందిన గీత కార్మికునికి 20లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా జైగౌడ ఉద్యమం సంఘం సభ్యులు సన్మానించారు. నారాయణగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను తెలియజేశారు. జైగౌడ ఉద్యమం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు తమటం వెంకటస్వామిగౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సోమ ప్రగతిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క వెంకట రమణగౌడ్, జిల్లా మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు నిర్మల్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతిగౌడ్, కొల్లాపూర్ తాలుకా అధ్యక్షుడు సురగోని వెంకటస్వామిగౌడ్, నాగర్‌క ర్నూల్ మునిసిపల్ వైస్ చైర్మన్ కల్పన, జిల్లా నాయకు లు రమేష్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, వెంకటేశ్వరగౌడ్, కాటమోని శ్రీధర్‌గౌడ్, గుండ్రాతి సత్యంగౌడ్, నిరంజన్‌గౌడ్, మోహన్‌గౌడ్, లింగస్వామిగౌడ్, రామన్‌గౌడ్, రమేష్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, బాలమణిగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- ఆకట్టుకున్న కోలాటం పోటీలు



కోలాటం పోటీలు తిలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్ మార్చి 15: నల్లమల్ల ప్రాంతంలో ఎత్తైన కొండపై వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం ఉత్సవాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. ఆలయం ఆవరణలో డివిజన్ స్థాయి కోలాటం పోటీలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను తిలకించడానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పాటు అమ్రాబాద్ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ, ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నరహరి, ప్రధాన కార్యదర్శి మద్దెల ఆనంద్ కుమార్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాన్ని నల్లమల ప్రాంతానికి చెందిన కళాకారులు ప్రదర్శించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్దకు శుక్రవారం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాల మహానాడు రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు కుందా మల్లికార్జున్, రమేష్ తదితరులు ఉన్నారు. మాలల ఆరాధ్య దైవమైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం అభివృద్ధి కోసం ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని చెన్నయ్య విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నరహరి ఆధ్వర్యంలో నిర్వహణ కమిటీ సభ్యులు నాసరయ్య, ఆనంద్, చెన్నకేశవలు, సుబ్బదాసు అంజీ, రమేష్ తదితరులు మాల మహానాడు జాతీయ అధ్యకుడు చెన్నయ్యను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ ఆవరణలోనే ఉన్న శిథిలావస్థకు చేరుకున్న (1905 సంవత్సరంలో నిజాం పరిపాలనలో నిర్మించిన) ఆసుపత్రి పాత భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ భవనాన్ని మరమ్మతులు చేయించడం కోసం ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులపై స్థానిక ప్రజలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం పదర మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ సమీపంలో ఒక ప్రైవేట్ సెల్ టవర్‌ను ప్రారంభించారు. ఆయన వెంట పదర జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు నాయక్, ఉప్పునుంతల జడ్పీటీసీ సభ్యుడు ప్రతాపరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోచం గణేష్, పదర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామలింగయ్య యాదవ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గడప గడపకు ఇందిరమ్మ సంక్షేమం

అచ్చంపేటటౌన్(నాగర్‌కర్నూల్): కాంగ్రెస్ పాలనలో గడప గడపకు ఇందిరమ్మ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే మహిళలకు అన్ని విధా ల అండగా నిలిచిందన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని పథకాలు అందించేందుకే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నాయకులు రాజేందర్, రామనాథం పాల్గొన్నారు.

మోదీ సభకు వచ్చే వాహనదారులకు సూచనలు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నేడు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా సభకు వచ్చే వాహనదారులకు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పలు ట్రాఫిక్ సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట వైపు నుంచి, కల్వకుర్తి నుంచి వచ్చే వాహనాలకు కొల్లాపూర్ చౌరస్తా దగ్గర ఉన్న గాయత్రి హాస్పిటల్ వెనకాల, సబ్‌స్టేషన్ దగ్గర ఉన్న లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ దగ్గర పార్కింగ్ స్థలాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. బిజినేపల్లి, తాడూరు మండలాల నుంచి వాహనాలకు నెల్లికొండ గేటు దగ్గర ఉన్న వ్యవసాయ మార్కెట్ దగ్గర పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా కొల్లాపూర్ నుంచి వచ్చే వాహనాలకు సఖి సెంటర్‌కు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మధ్య ఖాళీ స్థలంలో పార్కింగ్ సౌకర్యం ఉందన్నారు. భూత్పూర్, బిజినేపల్లి నుంచి అచ్చంపేట, శ్రీశైలం వైపుకు వెళ్లాలంటే, అలాగే భూత్పూర్, బిజినేపల్లి నుంచి కల్వకుర్తికి వెళ్లాలంటే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి, ట్యాంక్‌బండ్, తాడూరు, మంతటి చౌరస్తా దారిలో వెళ్లాలన్నారు. భూత్పూర్, బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ మీదుగా కొల్లాపూర్ వెళ్లాలంటే నాగర్‌కర్నూల్ టౌన్‌లో నాగనూల్ చౌరస్తా నుంచి నాగనూల్ గ్రామం, వనపట్ల గేట్ నుంచి కొల్లాపూర్ వెళ్లాలని సూచించారు. కొల్లాపూర్ నుంచి నాగర్‌కర్నూల్ మీదుగా బిజినేపల్లి, భూత్పూర్ వెళ్లాలంటే యాపట్ల గేటు నుంచి లెఫ్ట్ తీసుకుని నాగనూలు గ్రామం, నాగనూల్ చౌరస్తా, నాగర్‌కర్నూల్ బస్టాండ్ మీదుగా వెళ్లాలని సూచించారు. అచ్చంపేట నుంచి భూత్పూర్, మహబూబ్‌నగర్ వెళ్లాలంటే మంతటి నుంచి తాడూరు, ఉయ్యాలవాడ, బిజినేపల్లి మీదుగా వెళ్లాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు.

ఆదర్శవంతంగా పునరావాస గ్రామాల నిర్మాణం చేపడుతాం

- ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ - 90 శాతం మంది అంగీకారం



పునరావాస కమిటీకి గ్రామసభ తీర్మానం అందజేస్తున్న ఎంపీడీవో, ఎంపీవో గ్రామ ప్రత్యేక పాలనాధికారి వెంకటయ్య

దోమలపెంట, మార్చి 15: నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యం ప్రాంతంలోని వటవర్లపల్లి, కుడిచింతలబావి, సార్లపల్లి, కొల్లంపెంట, కొమ్మనపెంట గ్రామాలను ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా మైదాన ప్రాంతాలకు తరలించి వారికి మెరుగైన వసతులతో పాటు ఆదర్శవంతమైన గ్రామాలు నిర్మించి ఇస్తామని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ అన్నారు. శక్రవారం వటవర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక పాలనాధికారి ఎంపీవో వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో మోహన్‌లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ మాట్లాడూతూ పునరావాసం పథకంలో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం బాచారం తిరుపతి-హైదరాబాద్ పక్కన ప్రతీ కుంటుంబానికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, మౌలిక వసతులతో కూడిన ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తామని, ఇప్పటికే సార్లపల్లి, కుడిచింతబావి, గ్రామాల తరలింపు ప్రక్రియ పారంభమయిందన్నారు. వటవర్లపల్లిలో 600 కుంబాల వారు దరఖాస్తులు చేసుకున్నారు. త్వరలోనే ఆర్థిక పరమైన సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గుర్తించి ఎంపిక చేస్తామన్నారు. మొదటి విడతలో ఎంత మంది వచ్చినా తరలిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీవో వెంటయ్య మాట్లాడుతూ పునరావాసం ప్యాకేజీ కొరకు గ్రామంలో 90 శాతం మందికిపైగా దరఖాస్తులు చేసుకున్నారన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయం ఆమోదం మేరకు గ్రామ పంచాయతీ తీర్మానం ఇచ్చామని ఎంపీవో పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌వోలు బాగ్యమ్మ, వాసవి, ఎఫ్‌బీవోలో ముత్యాలు, తేజశ్రీ, రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు పునరావాస కమిటీ సభ్యులు సాయిబాబు తులసినాయక్, బాలకృష్ణ, లక్ష్మణ్‌రాజు, మక్బూద్, జైపాల్, రాజేష్, శివప్రసాద్, శ్యాంసుందర్, సాయి, మల్లేష్, కరీం, సాదిక్, షరీఫ్, పత్యనాయక్ పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

వెల్దండ, మార్చి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కల్వకుర్తి ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 1400 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. అల్లంతోటబావితండా, కల్యాణవాగుతండా, ఎంజీకాలనీ, పిల్లికండ్లతండాలలో దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసునమోదు చేశారు.

'మేరు కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయం'

అచ్చంపేట, మార్చి 15: వెనకబడిన తరగతులలో ఉన్న బీసీ-డీ కులస్తులైన మేరు సమాజం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ప ట్ల మేరు సంఘం నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ వెన్ను శ్రీనివాసులు, కొం డూరు భగీరథనాథులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనకబడిన మేర కులస్థులకు వెన్నదన్నుగా నిలుస్తున్నందుకు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం

తెలకపల్లి, మార్చి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని పెద్దపల్లికి చెందిన గౌని లలిత అనే మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ కథనం ప్రకారం...పెద్దపల్లికి చెందిన గౌని లలిత(38) భర్త అనారోగ్యంతో పది సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి లలిత తన కొడుకుతో ఊరిలోనే ఉంటూ ఫంక్షన్‌లో వంటలు చేస్తూ బతుకుతూ ఉండేది. ఈ నెల 9న వేరొకరితో డబ్బులు తీసుకుని సరుకులు తీసుకురావడానికి వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఆమె బావ అయిన గౌని మాధవయ్య ఫిర్యాదుపై హెడ్‌కానిస్టేబుల్ నారాయణ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గుండాలలో ఘనంగా పెద్ద రథోత్సవం



పెద్ద రథోత్సవంలో భక్తులు

వెల్దండ, మార్చి 15 : దక్షిణకాశీ గుండాల అంబారామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి పెద్దరథోత్సవ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రథాన్ని పూలతో అలంకరించారు. అనంతరం వివిద గ్రామాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులు మోకుల సహాయంతో లాగారు. ఆలయ పరిసరాలు భక్తుల కోలాహలంతో, శివనామస్మరణలతో మారుమోగాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎం. రవిలు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, నాయకులు ఉన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

కల్వకుర్తి, మార్చి 15 : విద్యార్థులు కష్టపడి చదువుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎల్లికల్ జడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసీ కమిటీ మాజీ చైర్మన్ బ్రహ్మం కోరారు. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు తమ జ్ఞాపకాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మండలంలో రూ, 2 కోట్లతో అభివృద్ధి పనులు'

వంగూరు, మార్చి 15: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే వంగూరు మండలంలో అభివృద్ధి పనులకు గాను రూ, 2 కోట్లకు పైగా నిదులు మంజూరు కావడం జరిగిందని జడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ, 15.50 కోట్లతో కొండారెడ్డిపల్లి-పోల్కంపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు, రూ, 58 కోట్లతో సర్వారెడ్డిపల్లి గేటు టూ వయా కొండారెడ్డిపల్లి మీదుగా ఎల్లికల్లు వరకు డబుల్ రోడ్డు, రంగాపూర్‌లో రూ, 3.50 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, కొండారెడ్డిపల్లిలో రూ. 20 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు అయ్యాయని, మండలంలోని సీసీరోడ్ల నిర్మాణ పనులకు రూ, 1.50 కోట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. మండలానికి చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆయన సహకారంతో పెద్ద మొత్తంలో అభివృద్ధి పనులకు నిధులు మంజురు అయ్యాయన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండిత్‌రావు, పాండురంగారెడ్డి, అల్వాల్‌రెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, శంకర్‌యాదవ్, జనార్దన్, వెంకటయ్యయాదవ్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేటీలకు కూలి చల్లించాలి

ఊర్కొండ, మార్చి 15: ఉపాది హామీ పథకంలో ఎన్ఎంఎస్ ద్వారా కూలీల హాజరు నమోదు చేసిన మేటీల కూలి చెల్లించాలని కోరుతూ శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ్ కుమార్‌కు మేటీలు వినతిపత్రం సమర్పించారు. 2022లో ఉపాధి హామీ పథకంలో ఎన్ఎంఎస్ తీసుకువచ్చి కూలీల హాజరు నమోదు చేసిన మేటీలకు రోజువారీగా రూ 272 ఇస్తామని తెలియజేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో మేటీలు సుమారుగా 15 నుంచి 20 వారాల పాటు ఎన్ఎంఎస్ ద్వారా కూలీల హాజరు నమోదు చేశామని, ఇప్పటివరకు ఎలాంటి కూలీ చెల్లించలేదని, వెంటనే ఇప్పించాలని వినతిలో తెలియజేశారు. రామాంజనేయులు గౌడ్, అన్వర్, జయరాములు గౌడ్ ఉన్నారు.

రైతులకు నానోయూరియాపై అవగాహన

తెలకపల్లి, మార్చి 15 : మండల పరిధిలోని గౌరారెడ్డిపల్లిలో శుక్రవారం రైతులకు నానోయూరియాపై పాలెం కృషి విజ్ఞాన కేంద్రం రావేప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించాలంటే పంట లకు ఎరువులు ఆవశ్యకత ఎంతో ఉందని, ప్రతి పంటలో యూరియా ఎరువు కచ్చి తంగా రైతులు వాడాలని పంటకు కావాల్సిన నత్రజని యూరియా ద్వారా లభిస్తుం దన్నారు. ఐఎఫ్ఎఫ్‌సీవో వారి నానోయూరియా పంట యొక్క నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా నెరవేరుస్తూ ఆకు కిరణజన్య సంయోగక్రియ, వేరు పెరుగుదల, స మర్థవంతమైన టిల్లర్లు శాఖలను పెంచుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఒక లీటరు నీటిలో రెండు నుంచి నాలుగు మి.లీటర్లనానోయూరియాను కలిపి పంట పెరుగుదల దశలో పిచికారి చేసుకోవాలని విద్యార్థినీలు కావ్య, ఎస్.నిఖిత, సాత్విక, నవ్య, ఎన్.నిఖితలు తెలిపారు.

22న వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బిజినేపల్లి, మార్చి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం గ్రామంలోని అడ్డుగుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాలు ఈనెల 22న ప్రారంభమవుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సందడి ప్రతాప్ రెడ్డి శుక్రవారం తెలిపారు. 22వ తేదిన ప్రారంభమై ఫాల్గుణ విదియ బుధవారం 27 తేదిన బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. 25న స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

అచ్చంపేట రూరల్, మార్చి 15 : అచ్చంపేట మండల పరిధిలోని అక్కారం గ్రామం, బండతండాలో శుక్రవారం సీసీ రోడ్లకు జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు రమావత్ మునిలాల్ భూమి పూజ చేశారు. 5లక్షల రూపాయలతో 70మీటర్ల సీసీ రోడ్డు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు కాంగ్రెస్‌లోకి..



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు

ఉప్పునుంతల, మార్చి 15: మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కడారి రామలక్ష్మమ్మ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల నాయకులు అనంతారెడ్డి, నర్సింహరావు, నర్సింహారెడ్డి, తిరుపతిగౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'వేంకటేశ్వర్ల చెరువు నుంచి సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి'

ఉప్పునుంతల, మార్చి 15 : మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన వేంకటేశ్వర్లు చెరువు నుంచి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీంద్రారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగా కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు వస్తుందని మండలంలోని పెద్దాపూర్, మొల్గర, లక్ష్మాపూర్ రైతులు యాసంగిలో సాగు చేసిన వరి నాట్లు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి లక్ష్మాపూర్ చెరువులో ఉన్న సాగు నీరు విడుదల చేసి ఆయా గ్రామాల రైతులను ఆదుకోవాలన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలి

దోమలపెంట, మార్చి 15: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలని డీటీడీవో కమలాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వటవర్లపల్లి ఆశ్రమ పాటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో అధైర్య పడకుండా ఉండాలని అన్నారు. వటవర్లపల్లిలో ఉన్న ఆశ్రమ పాటశాలలో కొన్ని గదులు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చివేసి నూతన భవనాలు నిర్మించి పేద విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీఎం తిరుపతయ్య, హెచ్ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు వెంకటయ్య, లింగయ్య ఉన్నారు.

రాగిజావను తీసుకుంటే ఆరోగ్యం

బల్మూరు, మార్చి 15 : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వీరంరాజుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు రాగి పిండి, బెల్లంతో కూడిన రాగిజావను ఏర్పాటు చేసి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ భారతి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో పిల్లలకు వేడిని తగ్గించేందుకు రాగి జావను ఏర్పాటు చేసి అందించడం జరుగుతుందని పిల్లలకు శక్తిని కలిగించే విధంగా ఉంటుందని ఆమె అన్నారు. స్థానిక ప్రాథమిక ఉపాధ్యాయురాలుతో పాటు ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

బల్మూరు, మార్చి 15 : మండల పరిధిలోని రామాజీపల్లి గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమంతోపాటు తదితర కార్యక్రమాలను ఆలయ పూజారులు నిర్వహించగా శనివారం ఆలయం ముందు ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గతంలో ఉన్న ధ్వజస్తంభం పడిపోవడంతో నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొల్లాపూర్, మార్చి 15 : కొల్లాపూర్ మండల పరిధిలోని రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం చెల్లించాల్సిన 4నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే.మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొల్లాపూర్ మండల పరిధిలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న నాలుగు నెలలు జీతాలు చెల్లించడం లేదని, మండల పరిధిలో ఉన్న డాక్టర్లు ఏఎన్ఎంలతో రాత్రి 9గంటల వరకు పని చేయించుకుంటూ వారికి ఇవ్వాల్సిన వేతనాల విషయంలో నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రెండవ ఏఎన్ఎంలకు ప్రతి నెల 2వ తారీఖు రోజున జీతాలు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 15వ తేదీ వచ్చిన జీతాలు రావడం లేదని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఉంటూ విధులు నిర్వహించే రెండవ ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శీలం వెంకటేశ్, పస్పుల కుమార్ పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు లక్కీడిప్

మన్ననూర్, మార్చి 15: నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని గిరిజన విద్యార్థులకు హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలు రామాంతపూర్, బేగం పేటలో 2024-25 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకై దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల్లో లాటరీ విధానం ద్వారా ఎంపిక ప్రక్రియను మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. చెంచు, లంబాడ ఎరుకల తెగలకు చెందిన ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు(మొత్తం6) సీట్లను భర్తీ చేసేందుకు లాటరీ టికెట్ల ద్వారా దరఖాస్తుదారుల సమక్షంలో గిరిజన సంక్షేమ అధికారులు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో బన్నీ, (చెంచు), ఆర్ చేతన్, ధనుష్(లంబాడ), బాలికల విభాగంలో సాహితి (చెంచు), యామిని(లంబాడ), తన్విత(ఎరుకల)లు ఎంపికయ్యారు. మరో 6 మందిని వెయిటింగ్ లిస్టులో ఉంచారు. ఎంపికైన విద్యార్థులు ఆధార్, కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, తల్లిదండ్రుల ధృవీకరణ పత్రాలతో ఈ నెల 18 సాయంత్రం 5 గంటలలోగా ప్రవేశాలు పొందాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి కోరారు. ఐటీడీఏ కార్యాలయ ఏవో జాఫర్ హుస్సేన్, ఐటీడీఏ, డీటీడీవో సిబ్బంది అయోధ్య కేశవులు పాల్గొన్నారు.